పెద్దకథల పోటీలో కన్సోలేషన్ బహుమతి పొందిన కథ

మనిషిలో మృగాలు

రంగుడు జి.వి.రామకృష్ణశర్మ

వెన్నెల ఛాయలింకా మాసిపోని వేకువ వాకిట్లో అందమైన వేళ్ళనుండి జారుతున్న తెల్లటి ముగ్గుచిత్రాకృతుల్ని ఆపాదించు కుంటోంది—

శ్రద్ధగా రంగవల్లుల్ని దిద్దుతున్న ఆమెను దీక్షగా చూస్తున్నాడతను — ముగ్ధత్వాన్ని సంతరించుకున్న ఆమె పాదాల నునుపు మీద వెన్నల మరిన్ని కళలతో ప్రతిఫలిస్తోంది—

అతను తన చేతిలోని మువ్వల పట్టీలను ఆమె కాళ్ళకు అలంకరించాలని ఆమెను చేరాడు — సిరివెలుగుల్లో తడుస్తున్న పరికిణీ జలతారు అంచును పైకి జరిపి, ఆ పట్టీలను పదహారేళ్ళ ఆమెకు పదహారాల్ని చేసే సమయంలో—

ఆమె కాలి మధ్య వేలికి వెండి ఉరిలా మట్టె — ఆమె శరీరం ఏ మాత్రం దాన్ని ఇముడ్చుకోలేనట్లు చుట్టూ రక్తపు చార — విస్ఫోటనమైన అతని కోరిక విలాపమైంది—

ఆమె కన్నీరు అతని తలపై అక్షింతలై కురుస్తోంది — తలెత్తి పైకి చూసాడు — ఆ ఇంటి గుమ్మానికి పసరు ఛాయలు మాసిపోని మామిడి తోరణం—

''వద్దు శైలజా! నా ప్రేమను భగ్నం చెయ్యొద్దు'' అరిచాడు దీనంగా—

''ఏమైంది బాబూ!'' అన్నాడు అతని పక్కనే కూర్చున్నాయన. సారధిని కదుపుతూ—

ఉలిక్కిపడి లేచాడు సారధి — అతను కూర్చున్న బస్సు గాలిని చీల్చుకుని వేగంగా సాగిపోతోంది — జేబు తడిమి చూసుకున్నాడు — కొన్ని గంటల క్రితం తనుకొన్న పట్టీలు భద్రంగా ఉన్నాయి—

అప్పుడు అర్థమైందతనికి — ఇంతసేపూ తను కలగన్నాడని—

''ఏమైంది బాబూ!'' అన్నాడు ప్రక్కతను మళ్ళీ—

''ఏం లేదు!'' అన్నాడు సారధి — కిటికీలోంచీ దూసుకొస్తున్న గాలిని ఏ మాత్రం లెక్కచెయ్యకుండా నుదురంతా పట్టిన చెమటను తుడుచుకున్నాడు—

ఆనందం, ఆవేదన, అనుమానం, ఆశ్చర్యం — ఇలా ఏ అనుభూతినైనా గుండె దాచుకోలేనప్పుడు అవి స్వప్నంగా రూపుదిద్దుకుంటుంది—

జీవితంలో ఎంతో అపురూపంగా దాచుకోవాల్సిన క్షణాలు త్వరలో ఎదురవబోతున్నప్పుడు, ఆ క్షణాలను కబళించే అవకాశాన్ని తన అంతశ్చేతన అనుమానం రూపంలో స్వప్నీకరించింది — అంతే—

కాని ఆ కల నిజమైతే...?

'కాదు' అనుకున్నాడు సారధి — కంటిరెప్పల మీద చూపుల్ని వెలిగించి నిరీక్షించే శైలజ తనకెప్పటికీ దూరం కాదు—

మువ్వల పట్టీలను చేతిలోకి తీసుకున్నాడు — చిరుకదలికకే అందమైన శబ్దాలను పుట్టిస్తున్నాయవి—

ఆ పట్టీలను శైలజ కాళ్ళకు అలంకరించాలి — ఎప్పుడో తనలో రూపు దిద్దుకున్న ఆ కోరిక కేవలం గంటల కాలం తర్వాత తీరబోతోంది—

శైలజ — ఉప్పొంగిన ఒక వెన్నెలకెరటం — ఏ సుందర సీమల నుండో దూసుకొచ్చిన సంధ్యా కిరణం — ఎవరో అజ్ఞాత శిల్పి రసానుభూతితో చెక్కిన చందన శిల్పం — ఆమె ప్రేమ తన జీవిత గమనాన్ని పూర్తిగా మార్చేసింది—

శైలజతో గడిపిన రోజులు గుర్తొచ్చాయి సారధికి — సాధారణంగా సాగిపోతున్న కాలానికి కొత్తదనాన్ని అద్దిన రోజులవి—

రిటైర్ కావడంతో తను పుట్టిన ఆ పల్లెటూరికి కుటుంబంతోసహా వచ్చేసాడు సారధి తండ్రి భట్టుమూర్తి — అతనికి ఆ ఊర్లో స్వంత ఇల్లుంది.

సారధి పుట్టకముందే ఆ కుటుంబం ఆ పల్లె వదలి వెళ్ళడంవల్ల ఆ పల్లెటూరికి, సారధికి ఎలాంటి ప్రత్యక్ష సంబంధమూ లేదు — ఏమైనా పనులుంటే భట్టుమూర్తే అక్కడికి వచ్చేవాడు—

తమతో తెచ్చిన సామాన్లను సర్దుతున్నాడు సారథి — అతనికా వాతావరణం కొత్తగా వుంది —''చదువు పూర్తి చేసి నిరుద్యోగం చేస్తున్న తనకు ఆ ఊర్లో కనీస కాలక్షేపమైనా జరుగుతుందా?'' అనే అనుమానం అతన్ని పీడిస్తోంది.

''సారథీ'' తండ్రి పిలుపు వినబడి గదిలోంచీ బైటికొచ్చాడు — తండ్రితోపాటుగా ఎవరో అపరిచిత వ్యక్తి—

''నేను చెప్పానే రాఘవ అని! ఈయనే!'' అన్నాడు భట్టుమూర్తి, సారథికి అతన్ని పరిచయం చేస్తూ—

''నమస్కారం'' అన్నాడు సారథి చేతులు జోడిస్తూ — రాఘవ భట్టుమూర్తికి బాల్యస్నేహితుడని అతను విన్నాడు—

''మా అబ్బాయి పార్థసారథి! ఈ మధ్యే చదువు పూర్తిచేసి ఉద్యోగ ప్రయత్నాల్లో వున్నాడు'' అన్నాడు భట్టుమూర్తి—

'అలాగా!' అన్నట్లు తలూపి పెరటివైపు తిరిగి 'శైలజా'' అని అరిచాడు రాఘవ—

''వస్తున్నాను'' అని వినిపించిందొక ఆడగొంతు—

ఆ శైలజ ఎవరో అర్థంకాలేదు సారథికి — పనిలో మునిగి వచ్చిన వాళ్ళను పట్టించుకోకుండా గదిలో స్థిరపడిపోయాడు తను — మరెలా తెలుసుంది?

''పని పూర్తయిందా?'' అడిగాడు భట్టుమూర్తి సారథిని—

''లేదు'' అన్నాడు సారథి — మళ్ళీ గదిలోకి వెళ్ళేందుకు వెనుతిరగబోతూ అప్రయత్నంగా ఆగిపోయాడు—

అతని తల్లితోపాటు ఒక అమ్మాయి వాళ్ళ వైపు వస్తోంది — రెప్పవెయ్యనీయని స్థితి చూపరులకు కలిగించే రూపం ఆమెది — సుగంధ సమీరంలా కదిలొచ్చి ఆగిన ఆమె సారథిని చూసి బిడియపడుతున్నట్లు తలదించుకుంది —

''వస్తాను'' అన్నాడు రాఘవ, బయటికి నడుస్తూ — ఆమె కూడా వెళ్ళిపోయింది—

సారథి రాత్రి భోజనం చేస్తూ అడిగాడు

తల్లిని, రాఘవ గురించిన వివరాలు — శైలజ అతని కూతురని, తమ ఎదురింట్లోనే వాళ్ళుంటారని తెలిసింది.

భోజనం చేసి తనకు కేటాయించిన వీధి గదిలోకి వచ్చాడు — మంచం మీద పడుకొని కిటికీలోంచీ చూస్తే ఎదురిల్లు కనబడుతోంది—

శైలజ గుర్తొచ్చింది సారథికి — తనను చూసి సిగ్గు పడ్డప్పుడు ఎర్రబడ్డ ఆమె ముఖం జ్ఞాపకం వచ్చింది — ఆమె ఆలోచనతోనే నిద్రలోకి జారుకున్నాడు.

వీధిలో ఏదో పడ్డట్టు శబ్దం వినిపించి తెలివొచ్చింది సారథికి — లేచి కిటికీ దగ్గరకొచ్చాడు — ఎదురింటి ముందు దీపం వెలుగుతోంది — చేతిలోని ముగ్గుచిప్పను ముంగిట్లో జార్చేసిన ఆమె దాన్ని తీసుకొని లోపలికి వెళ్ళిపోయింది — ఆమె వేసిన ముగ్గును చూస్తూ అతను చాలాసేపు ఉండిపోయాడు—

మర్నాటినుండి ఆమె ముగ్గులు వేసేందుకు రాకముందే అతను మేల్కొని కూర్చునేవాడు ఆమె కోసం నిరీక్షిస్తూ ఒక్కోసారి ఆమె ఒక్కతే వచ్చేది — కొన్నిసార్లు తన చెల్లెలికి ముగ్గులేయడం నేర్పేది — సారథికి నవ్వొచ్చేది ఆ పిల్ల వేసే వంకర గీతల్ని చూసి—

ప్రతిరోజూ ఏదో పని మీద శైలజ సారథి ఇంటికి వచ్చినా స్వేచ్ఛగా చూసే అవకాశం అతనికి దొరికేది కాదు — అందుకే తెల్లారుజామునే అతను నిద్రకు వీడ్కోలు చెప్పేవాడు—

అతనిలో ఆమెను ప్రేమిస్తున్నాననే భావం కలిగి క్రమంగా పెరగసాగింది — ఆ విషయాన్ని ఆమెకు తెలియజేయాలి — ఎలా...

ఉత్తరాలు వ్రాయడంలాంటి పనులు అతనికి ఇష్టం లేదు — ముఖాముఖీ తేల్చుకోవాలనే నిశ్చయించుకున్నాడు — కాని ఆమెతో మాట్లాడే అవకాశం దొరకలేదు—

ఒకరోజు ఏటివైపు షికారుకు వెళ్ళాడు సారథి — అప్పటికే ఆమె నీటి బిందెను నడుముపై ఉంచుకొని వెళ్ళిపోతోంది — ఆమెను పలుకురిద్దామనే అతని ప్రయత్నం ఫలించలేదు — అయితే ఆమెకుతన ప్రేమను తెలిపే అవకాశం అనుకోకుండా లభించింది సారథికి — ఆ మర్నాడే—

పక్క ఊర్లో జరిగిన జాతర చూసి తిరిగి వస్తున్నాడు సారథి — వినడమే కాని అతనెప్పుడూ అలాంటివి చూడలేదు—

ఏదో సరికొత్త ప్రపంచంలో ప్రవేశించిన అనుభూతి అతనికది— ఎటు చూసినా సందడి — ఎన్నో మనస్తత్వాలు భక్తి అనే ఏకసూత్రం మీద ఒకచోట చేరడం అతనికి ఆశ్చర్యం కలిగించింది — చిరుతిళ్ళ దుకాణాల మీద, రంగులరాట్నం కోసం ఎగబడే పిల్లలు — అందాలను వెంబడిస్తూ సాగిపోయే తన వయస్సు కుర్రాళ్ళూ — మధ్యలో పులివేషాలు, రకరకాల నృత్యాలు — చిన్నపైజు కొట్లాటలు—

చదువు తప్ప ఇంకే ధ్యాసా లేకుండానే అతని సమయమంతా గడిచేది — మిగతా వాటిని పట్టించుకొనే తీరిక అతనికి దొరికేది కాదు — చదువు పూర్తయ్యాక తీరిక లభించడంవల్ల ప్రతిదాన్ని పరిశీలించే తత్వం

కొంత ఆలస్యంగానైనా అతన్ని ఆవరించుకుం
ది—

జాతర జరిగిన చోటు నుండి అతని ఊరికి నడకదారి మాత్రమే ఉంది — అతను బయలుదేరేసరికి చీకటి పడింది — దారి దాదాపు నిర్మానుష్యంగా ఉంది—

అంతవరకూ ఆకాశంలో కొలువుతీర్చిన మబ్బులు కరిగి కురవడం ఆరంభించాయి — వేగంగా నడుస్తున్నాడు — అతను పూర్తిగా తడిసిపోయాడు — చుట్టూ ఉన్న పొలాల మీంచీ తెరలా కదలివస్తున్న గాలి అతన్ని వణికిస్తోంది—

ఊరు దగ్గరకొచ్చేసరికి వర్షం మరింత విజృంభించింది — నడుస్తూనే చుట్టూ పరికించాడు — రోడ్డుప్రక్క కొంతదూరం లో ఒక పశువుల కొట్టం కనిపించింది సారథికి — వేగంగా దాని క్రిందకు చేరుకున్నాడు—

జేబులోంచీ రుమాలు తీసి తుడుచుకో బోతూ పక్కకు చూసాడు —అక్కడో స్త్రీ ఆకారం—

అప్పుడే ఆకాశం బ్రద్దలైనట్లు పెద్ద శబ్దంతో ఉరుము — ఆ వెనుకే ఒక మెరుపు మెరిసింది. అప్పుడు తెలిసిందతనికి — ఆమె 'శైలజ' అని—

"మీరా!" అందామె — ఆ చీకటికి అలవాటుపడటంవల్ల వెంటనే అతన్ని గుర్తిం చింది.

అవునన్నట్లు తలూపాడు సారథి—

"జాతరకు వెళ్ళారా?" అడిగింది—

మళ్ళీ తలూపాడు సారథి అవునన్నట్లు — అప్పుడతనికి శైలజ స్పష్టంగా కనిపిస్తోంది — 'నీటిలో విరబూసిన కలువ పువ్వులా వుంది' అనుకున్నాడు సారథి—

"నా స్నేహితురాళ్ళతో జాతరకు వెళ్ళా ను. అక్కడ వాళ్ళూ, నేనూ విడిపోయాం!' అంది శైలజ. "వాళ్ళ కోసం వెతికివస్తూం టే..."

తనను చూసి సిగ్గుతో పారిపోయే ఆమే చొరవ తీసుకొని మాట్లాడటం అతనికి క్షణంపాటు ఆశ్చర్యం కలిగించింది—కాని తర్వాత అనిపించింది. ఈ వాతావరణంలో తోడొకరున్నారనే ధైర్యాన్ని కలిగించుకోవడం కోసమేనని—

రివ్వున వీచిన గాలి ఒక నీటి కెరటాన్ని వాళ్ళపై అభిషేకించి సాగిపోయింది—

కొద్దిసేపయ్యాక ఆమె వణుకుతూ అంది "వర్షం తగ్గినట్లుంది వెళ్దామా!"

సమాధానంగా అతను ముందుకి నడిచాడు —వెనుకే ఆమె కూడా—

ఇద్దరూ వాళ్ళ వీధి మొదలు చేరుకున్నారు—

"ఇంతసేపూ నేను మాట్లాడుతూంటే మీరు కనీసం సమాధానం చెప్పటంలేదేం?" అందామె హఠాత్తుగా—

ఆమె గొంతులో ధ్వనించిన విసుగుకు నవ్వొచ్చింది సారథికి — నవ్వుతూ అక్కడే ఆగిపోయాడు — ఆమె కూడా ఆగింది అర్థంకాక—

నవ్వును ఆపి చెప్పాడతను — "నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను! ఐ లవ్ యూ! మీతో నేను మాట్లాడే మొదటి మాట అదే కావాలని నా కోరిక! అందుకే మాట్లాడలేదు!"

ఆమె అతని వంకే చూస్తూ వుండిపోయింది— ఆశ్చర్యమో, మరేమిటో తెలియని భావం వీధి దీపపు వెలుగులో అతనికి కనిపించింది ఆమె ముఖంలో—

"మీ అభిప్రాయాన్ని ఇప్పుడు చెప్పనవసరం లేదు శైలజా! రేపంతా ఆలోచించుకోండి!" అన్నాడతను "నా అభిప్రాయాన్ని మీకు తెలియజేసాను! మీకు నా ప్రేమ ఇష్టంలేకపోతే కొంతసేపటి క్రితం వరకూ ఎలా గడిపామో భవిష్యత్తులో కూడా అంతే!"

సారథి ఇంటివైపు నడిచాడు — ఆమె అలాగే నిలబడి వుంది.

మరుసటిరోజంతా చాలా ఇబ్బందిగా గడిచింది సారథికి —'ఇష్టం లేకపోతే ఇలాగే ఉందాం' అనేసాడే కాని నిజంగా అదే జరిగితే! అనే అనుమానం అతన్ని బాధించసాగింది — ఆ రాత్రంతా అతను దాదాపుగా జాగారం చేసాడు — అర్ధరాత్రి దాటిన తర్వాతెప్పుడో నిద్రపోయిన అతనికి తెలివొచ్చేసరికి తెల్లవారుతోంది—

లేచి కిటికీ దగ్గరకొచ్చాడు సారథి — ఎదురింటి వీధి వాకిలి చుట్టూ జనం నిలబడి ఏదో చూస్తున్నారు — అతను కూడా వీధిలోకి వచ్చి అక్కడికి నడిచాడు —

ఆ ముంగిట్లో చిటికిన వేలి మీద గిరివెత్తుతున్న కృష్ణుడి బొమ్మ ముఖం వరకూ వేసి వుంది — ఆ బొమ్మ కింద ఒక పూల దోసిలి — రకరకాల రంగుల్తో ఉందా బొమ్మ—

కొంతసేపటివరకూ అతనికి అర్థం కాలేదు ఆ బొమ్మ గురించి — అర్థంకాగానే ఇంట్లో ఉన్న కెమెరా తీసి బయటికొచ్చాడు — రీలు పూర్తయ్యేవరకూ ఆ బొమ్మను ఫొటోలు తీస్తూనే వున్నాడు.

"మాటల్తో చెప్పొచ్చుగా!" అన్నాడు సారథి శైలజతో—

"కొత్తగా వుంటుందని" అందామె—

"ఏమిటి? ప్రేమా...."

ఏరు ఉరకలేస్తూ పారుతోంది. దూరంగా గిరికీలు తిరుగుతూ సాగిపోతోందో పడవ — వాళ్ళిద్దరూ ఇసుకలో నడుస్తున్నారు — ఆమె చేతిలో నీటిబిందె—

"ఉదయం వీధిలో అందరూ ఎంత ఆశ్చర్యపోయారో తెలుసా?" అన్నాడు సారధి — ఆమె తలదించుకుంది నడుస్తూనే—

"రేపు ఏ బొమ్మ వేస్తావు?" అడిగాడు సారధి—

ఆమె చివాలున తలెత్తి "మీ బొమ్మే" అంది నవ్వుతూ—

"ముగ్గులోకి దించేస్తావన్నమాట"

"దింపడమేమిటి? మీరే దిగిపోతేను!" అంది శైలజ.

ఆ రోజు నుండి వాళ్ళ ప్రేమ కొత్తపూలు పూయడం ప్రారంభించింది — సారధి ఇంటికి బంధువులెవరో రావడంతో అతని పడక వీధి అరుగు మీదికి మారింది — ఆ మార్పు అతనికెంతో సంతోషాన్ని కలిగించింది, శైలజ ముగ్గులేస్తూంటే దగ్గర గా చూడొచ్చని—

చాలాసార్లు అతను నిద్రలేచేసరికి ఇంకా తెల్లారకపోయినా ఆమె ఇంటి ముందు ముగ్గులుండేవి—

"ఎన్ని గంటలకు లేస్తావు ప్రతిరోజూ!" అడిగాడు శైలజను ఒకరోజు—

"నాలుగు గంటలకి" అందామె

"ఎందుకు?"

"ఏం లేదు" అన్నాడు సారధి — "నిన్నెందుకు ప్రేమిస్తున్నానో తెలుసా?"

"ఉహు!" అంది శైలజ—

"నీ కళ్ళు విచ్చిన కలువలు" అన్నాడత ను—

"చాలా పాత పోలిక!" అందామె—

"నీ ముక్కు సంపెంగ!"

"అదీ పాతదే!"

"పోనీ! పళ్ళు దానిమ్మగింజలు! పెదవు లు పగడాలు"

ఆమె నవ్వాపుకుంటూ అంది "కొత్త పోలికలేం లేవా?"

"కొత్తవి పుట్టించే ఓపిక నాకు లేదు"

"సరే! ఇంకా..." అంది శైలజ నవ్వు తూ—

"ఆ ఇంకాలు పెళ్ళయ్యాక చెప్తాను!" అన్నాడు సారధి చిలిపిగా— "ఇదంతా ఎందుకు చెప్పానంటే అంత అందమైన

నువ్వు వెన్నెల్లో ముగ్గేస్తూంటే చూడాలనేది నా ఆశ! కాని నేను లేచేసరికి నువ్వు వెళ్ళిపోతున్నావు!''

''నేనేం చెయ్యను''

''నన్ను లేపొచ్చుగా!''

''అమ్మో!''అందామె గుండెల మీద చెయ్యి వేసుకొని — ''ఎవరైనా చూస్తే''

అతను ఆలోచనలో మునిగిపోయాడు — శైలజ చెప్పింది నిజమే — ఆమెతోపాటు ఒక్కోసారి ఆమె చెల్లెలు కూడా వస్తుంది — అలాంటప్పుడు తను నిద్ర నటిస్తూంటాడు —

శైలజ ముగ్గేస్తూంటే తను పడుక్కొని చూసే భంగిమను ఆమె విష్ణుమూర్తి బొమ్మ అంటుంది — వీధిలోకి ఎవరైనా వచ్చినప్పుడు ఆ భంగిమ మార్చేస్తాడు — అలాంటి స్థితిలో ఆమె తననెలా లేపుతుంది?—

''ఒక ఆలోచన'' అన్నాడు సారధి—

''ఏమిటది?'' అంది శైలజ—

''మువ్వల పట్టీలు'' అన్నాడతను ఆనందంగా—

''మువ్వల పట్టీలా?'' అందామె ఆశ్చర్యంగా—

''అవును! అవి నీ కాలికి తొడుక్కొని నడుస్తూంటే చప్పుడౌతుంది — నేను లేస్తాను'' అన్నాడు సారధి —

''అందుకనే కాదు శైలజా! నేను చాలా రోజుల్నుంచి అనుకుంటున్నాను! వెన్నెల్లో పాలరాతిలా మెరిసే నీ పాదాలకు మువ్వల పట్టీలు అలంకరిస్తే ఎంతో అందం వస్తుంది'

''మా నాన్నతో కొనమని చెప్తాను సరేనా!'' అంది శైలజ.

''వద్దు'' అన్నాడు సారధి ''నేనే కొంటాను''

''ఎప్పుడు?''

తండ్రిని డబ్బు అడుగుతాననడం అతనికి చిన్నతనంగా తోచింది ''ఉద్యోగం వచ్చాక'' అన్నాడు—

''ఆ తర్వాత మన పెళ్ళైతే ఇక మువ్వల చప్పుళ్ళెందుకు?'' అందామె లాజిక్‌గా—

ఆంతటితో ఆ సంభాషణ ఆగిపోయింది — అయితే సారధికి మాత్రం ఆమె మువ్వల పట్టీలు అలంకరించుకుంటే చూడాలనే కోరిక రోజురోజుకూ ఎక్కువ కాసాగింది — ముఖ్యంగా ఆమె పాదాలను చూసినప్పుడు—

''ఎక్కడికెళ్ళేవు'' అడిగాడు భట్టుమూర్తి ఒకరోజు సారధి ఇంటికి రాగానే—

''ఏటి వొడ్డుకు'' అన్నాడు సారధి—

''ఇంత క్రితమే రాఘవ వచ్చి వెళ్ళాడు! వాళ్ళమ్మాయితో నువ్వు తిరుగుతున్నావని ఊరంతా చెప్పుకుంటున్నారన్నాడు'' అని ఆగి ''నాతో కూడా కొందరు చెప్పారు'' అన్నాడు.

'చెప్పాల్సిన సమయం వచ్చినప్పుడు దాచి ప్రయోజనం లేదు' అనుకున్నాడు సారధి.

''నేను ఆమెను ప్రేమిస్తున్నాను!'' అన్నాడు.

''సిగ్గు లేకపోతే సరి! పనీ, పాటా, లేకుండా ఊరమ్మట తిరుగుతూ ఇదా నువ్వు చేసిన ఘనకార్యం'' అన్నాడు భట్టుమూర్తి కోపంగా—

''నేనా అమ్మాయిని పెళ్ళి చేసుకుంటాను'' అన్నాడు సారధి తండ్రి మాటను

వినిపించుకోనట్లు—

"నీకిచ్చి పెళ్ళిచేసేదెవరు?" అన్నాడు అప్పుడే ఆ ఇంట్లోకొచ్చిన రాఘవ —"ఇప్పుడే మా అమ్మాయికి చీవాట్లేసి వస్తున్నాను! అయినా కానీ సంపాదన లేనివాడివి! నీకు ప్రేమా, పెళ్ళీ కావలిసొచ్చాయా!"

ఇక మాట్లాడ్డానికేం లేదనిపించింది సారధికి— ప్రతి మనిషికీ ఏదో ఒక వీక్‌పాయింట్ వుంటుంది — అతనికి నిరుద్యోగం — దాని మీద అవతలివాడు వాదనను నిర్మించుకున్నాక తను చేయగలిగిందేం లేదు — మౌనం వహించడం తప్ప—

"నీ కొడుకును అదుపులో పెట్టుకో! ఇంకోసారి మా అమ్మాయి వైపు కన్నెత్తి చూసినా మర్యాద దక్కదు!" అన్నాడు రాఘవ భట్టుమూర్తితో — తిరిగి వెళ్తూ — ఆ తర్వాత తన తండ్రి అన్న మాటలకు ఆ రాత్రంతా సారధి నిద్రపోలేదు బాధతో—

"నువ్వు వెంటనే ఉద్యోగం సంపాదించుకోవాలి సారధీ!" అంది శైలజ—

"వెంటనే ఎలా దొరుకుతుంది?" అన్నాడతను—

"ప్రయత్నిస్తే దొరుకుతుంది! ఈ ఊరు దాటకుండా అన్నీ సాధిస్తానంటే ఎలా?"

"నన్నిప్పుడేం చెయ్యమంటావ్!" అన్నాడు సారధి — ఇంట్లో గొడవ జరిగినప్పటి నుండి అతను నిస్పృహలో మునిగిపోయాడు — శైలజ తనని రహస్యంగా కలుసుకోమని చెల్లెల్తో కబురంపినా అతను అదే స్థితిలో వచ్చాడు—

"మా నాన్న నాకు వేరే సంబంధాలు చూస్తున్నాడు సారధీ!" అందామె —"లాంచర్లో పెళ్ళి చేసేస్తానని కూడా అంటున్నాడు! అప్పుడు మన వాళ్ళని ఎదిరించి వెళ్ళాలన్నా డబ్బు కావాలి కదా!"

అతను వింటున్నాడు — ఆమె కొనసాగించింది — "కనీసం మనిద్దరమూ బ్రతికేందుకైనా నీకో చిన్న ఉద్యోగం ఉండాలిగా సారధీ! అందుకే..."

ఆమె మాటల వెనుక ఎంత ఆలోచన ఉందో అర్థమైంది సారథికి — తను కేవలం ప్రస్తుతం గురించి ఆలోచిస్తున్నాడు — ఆమె దృష్టి భవిష్యత్తులో ఉంది—

"వెళ్తాను శైలజా!" అన్నాడతను నిశ్చయంగా — "విశాఖపట్నంలో నా స్నేహితుడు ఉన్నాడు! అక్కడికి వెళ్తాను"

ఆమె ఇంకేం మాట్లాడలేదు — మాట్లాడనక్కర్లేదు కూడా — ప్రేమలోంచి పుట్టే అణువంత స్ఫూర్తి మనిషి పరిధిని బ్రహ్మాండమంత విస్కృతం చేస్తుంది.

అతనన్నాడు — "రేపే బయల్దేరతాను శైలజా! ఎప్పుడో నీకు చేసిన ఒక వాగ్దానం నాకు గుర్తుంది! నీ కాళ్ళకు మువ్వల పట్టీలు తొడుగుతాననేది! అది నా కోరిక కూడా! అందుకే ఉద్యోగం సంపాదించి ఆ పట్టీలతో తిరిగొస్తాను"

మర్నాడే సారథి ఆ ఊరు వదలివెళ్ళిపోయాడు — రెండు నెలలపాటు చిన్న ఉద్యోగాలు చేసాడు — ఆ డబ్బు అతను బతికేందుకే సరిపోయేది కాదు — సారథి విశాఖపట్నం వచ్చిన తొలి రోజుల్లో అతని ఊరు నుంచి వచ్చిన ఒక వ్యక్తి కలిసాడు — శైలజకు పెళ్ళి చేద్దామనే ప్రయత్నం జరుగుతోందని, ఇంకా ఏ సంబంధం నిశ్చయం కాలేదని చెప్పాడు—

అప్పటి నుండి సారథి ఉద్యోగ ప్రయత్నాలు ఎక్కువయ్యాయి — మూడో నెలలో అతనికో స్థిరమైన ఉద్యోగం దొరికింది—

మొదటి జీతం వచ్చిన వెంటనే మువ్వల పట్టీలు కొని తన ఊరికి బయల్దేరాడు సారథి — శైలజకు వాటిని అలంకరించేందుకు — ఆమెతో తన జీవితాన్ని ముడివేసుకొనేందుకు—

కండక్టర్ తమ ఊరి పేరును గట్టిగా అరవడంతో ఆలోచనల్లోంచీ బయటపడి భుజాన బేగ్‌తో బస్సు దిగాడు సారథి — బస్టాపు నుండి ఊర్లోకి నడవసాగాడు—

ఊరంతా సుషుప్తిలో కొట్టుకుంటోంది — నిర్మానుష్యత వల్ల కలిగిన నిశ్శబ్దం వీధుల్ని ఆక్రమించుకుంది—

వాచీ చూసుకున్నాడు సారథి — నాలుగు గంటలు దాటింది — శైలజ ముగ్గులు వేసే సమయానికి అక్కడికి వెళ్ళాలనే నిర్ణయంవల్ల కావాలనే ఆ బస్సు ఎక్కాడు.

వేగంగా నడుస్తున్నాడు — ఏదో తెలియని ఉద్వేగం అతన్ని ఊపేస్తోంది — అతనిగుండె ఆనందంతో నర్తిస్తోంది—

తమ వీధిని చేరుకున్నాడు సారథి—

శైలజ ఇంటి ముందు దీపం వెలుగుతోంది — ఆ ఇంటి గుమ్మంలో ఆమె దీక్షగా ముగ్గుల్ని పరిశీలిస్తోంది — వెనుక నుండి వస్తున్న సారథిని ఆమె గమనించలేదు—

సవ్వడి చెయ్యకుండా పట్టీలను మెల్లగా చేతుల్లోకి తీసుకున్నాడు సారథి — మెట్ల మీద కూర్చున్న ఆమె ముందుకు నడిచాడు —

ఆమెలో సంభ్రమం — అతన్ని చూసిన ఆమె కళ్ళు ఎన్నో రోజుల విరహాన్ని నీటిరూపంలో వెలిబుచ్చుతున్నాయి—

అతను మోకాళ్ళ మీద కూర్చొని ఆమె కాళ్ళను దాచేస్తున్న పరికిణీని కొంచెం పైకి జరిపాడు — ఆమె కుడికాలు సగం వరకూ శూన్యంగా ఉంది—

వేటగాడి బాణపు దెబ్బ తగిలి గుండె రెండుగా చీలిన పక్షిలా విలవిలలాడాడు సారధి — అతనిలో వేదన చెలియలికట్ట దాటి పెల్లుబుకుతోంది—

"ఎలా జరిగింది శైలజా!" అన్నాడు సారధి ఆక్రోశిస్తూ—

"పెళ్ళి చేయబోతూంటే కొండ మీంచి దూకింది సారధీ!" అన్నాడు అప్పుడు ఇంట్లోంచీ బైటికొచ్చిన రాఘవ — అతని ముఖంనిండా విషాదం—

"మోకాలి వరకూ తీసేయాల్సొచ్చింది. అన్నాడు మళ్ళీ—

ఆ గుమ్మంలోని ముగ్గుకేసి చూసాడు సారధి— పిచ్చిగీతల అల్లికలా ఉంది — మెట్లకు కొంచెం దూరంలా ఊతకర్రల జత — శైలజ వైపు చూసాడు సారధి—

అతని చేతిలో మువ్వల పట్టీలు — ఆ ఇద్దరి కళ్ళల్లో తరగని కన్నీళ్ళు—

శైలజ, సారధి నిర్మించుకున్న చిన్ని పొదరింట్లో మువ్వల పట్టీలు దండలా గోడకు వ్రేలాడుతున్నాయి — మూగగా — వారి ప్రేమకు సాక్ష్యంగా—

*